క్లుప్తంగా

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

ఇచ్చోడ: కేంద్రం ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై బీజేవైఎం కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మానాల శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలుపించుకునే విధంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గోతి సునీల్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

నేరడిగొండ: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడాలని నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని కుప్టి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని సామాజిక కార్యకర్త కొయ్యాడి గంగయ్య గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న తెలంగాణ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మొక్క నాటారు. ఎస్సై మాట్లాడుతూ.. ప్రకృతి ప్రియుడు గంగయ్యలాగే ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలన్నారు. అనంతరం కుమారి తాజామాజీ సర్పంచ్ ఓర్స రాజు యాదవ్, ఉప సర్పంచ్ గడ్డం నరేశ్‌రెడ్డిలను సన్మానించారు. కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, వీడీసీ చైర్మన్ శ్రీధర్, నవీన్ చారి, వెంకట రమణ, క్లెం భోజన్న, నక్క నరేశ్, రమణ పాల్గొన్నారు.

పూలాజీ బాబా అడుగుజాడల్లో నడవాలి

తలమడుగు: సద్గురు పూలాజీ బాబా అడుగుజాడల్లో నడవాలని సీనియర్ పీరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ అన్నారు. గురువారం ప్రపంచ మహిళా దినోత్సవం, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని, తలమడుగు పూలీజీ బాబా ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతిఒక్కరూ శ్వాస మీద ధ్యాసతో ధ్యానం చేయాలన్నారు. ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో రాజశేఖర్, సురేశ్ రెడ్డి, అశోక్, పద్మాకర్ రెడ్డి, సునీత రెడ్డి, భోజమ్మ, భూమయ్య పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగించుకోవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని రాజులతండా గ్రామంలో పర్యటించారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్క కుటుంబం బయటకు వెళ్లకుండా మరుగుదొడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్ జాదవ్ చంపత్ రావు, గ్రామస్తులు ఉన్నారు.

మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

బోథ్: మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. మండలంలోని పట్నాపూర్‌లో జెడ్పీ నిధుల నుంచి రూ. 5 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని గురువారం ప్రారంభించారు. గత 17 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీలో హైమస్ లైట్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంద్రం సుగుణ, తొడసం కైలాస్, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, రమణగౌడ, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

ఆదిలాబాద్: శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని శైవాలయాలు ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం కోసం అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీలు పూర్తి చేశాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమయ్యాయి.

రద్దీగా నందీశ్వరాలయం

బేల: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని బాది గ్రామ శివారులోగల నందీశ్వరాలయం గురువారం రద్దీగా మారింది. ప్రత్యేక ఉపవాస దీక్షలతో భక్తులు బారులుతీరారు. ఆలయంలో శివలింగం, నందీశ్వర విగ్రహాలకు జుగ్నాక్ వంశీయులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి జాతర ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం భక్తులు పూజలు చేశారు. ఆవులు, లేగలు, దూడలను ఆలయానికి ఇచ్చి మొక్కు చెల్లించుకున్నారు. ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇక్కడ బసచేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం

- మహిళా ఉద్యోగులను సన్మానించిన అధికారులు, ప్రజాప్రతినిధులు


ఆదిలాబాద్‌టౌన్: మహిళా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు సంస్కృతిక పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మహిళ ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఉద్యోగులను సత్కరించారు. ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయురాలు, మహిళా హక్కుల ఉద్యమకారిణి ఆత్రం సుగుణను సత్కరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త, ఫిజికల్ డైరెక్టర్ అనిత, లెక్చరర్లు జ్యోత్స్న, భువన, సాలేహా, ఆఫ్రీన్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రంగినేని మనీషా, విశ్రాంత లెక్చరర్ సుజాత, నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త సుశీల్‌లు పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ జలగం అనిత, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్ రావు, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు మరింత రాణించాలి

గుడిహత్నూర్: మహిళలు అన్నిరంగాల్లో మరింత రాణించాలని ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా, జెడ్పీటీసీ, బీజేపీ జిల్లా ప్రెసిడెంట్ పతంగే బ్రహ్మానంద్ అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన మహిళ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ మహ్మద్ హై, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రత్నమాలను చైర్మన్ జనార్దన్ రాథోడ్, అధికారులు పూలమాల, శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ సూపరింటెండెంట్‌లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు జిల్లా రీజినల్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. బోథ్‌లో మహిళా సంఘాలు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. మహిళా సంఘాలకు టీజీబీ ద్వారా అనేక రుణాలు ఇస్తున్నామన్నారు. టీజీబీ మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్, మహిళా సంఘాల సభ్యులు, ఏపీవో మాధవ పాల్గొన్నారు.

తలమడుగు: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలను సన్మానించారు. మహిళలకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్, ఎంపీడీవో శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులను సత్కరించారు. పోటీ ప్రపంచంలో అందరూ సమానులే అని అన్నారు. కార్యక్రమంలో బానోత్ గజానంద్ నాయక్, సురేష్ ఆడే, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, పరమేశ్వర్ చంద్రకళ, అబేధ ఖానం, కనక ప్రభాకర్, షేక్ దాదే అలీ పాల్గొన్నారు.

నేరడిగొండ: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీడీవో రాజ్‌వీర్‌లు అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో పాటు మహిళా ఉద్యోగులను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, ఐకేపీ ఏపీఎం రాథోడ్ ఉత్తం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫేరోజ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు పాల్గొన్నారు.

ఇచ్చోడ: అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తున్నారని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీవో సాయిప్రసాద్, ఎంపీడీవో సూపరింటెండెంట్ పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: మహిళలకు అన్ని రంగాల్లో పోటీపడి ముందుకెళ్లినప్పుడే మహిళల విజయం సాధ్యమవుతుందని ఎంపీపీ మంజుల అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మండల పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులతో పాటు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్ రెడ్డి, సూపరింటెండెంట్ రవీందర్, ఏపీవో విజయ, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


తలమడుగు: మహిళలను సన్మానిస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి


నార్నూర్: మహిళలను సన్మానిస్తున్న నాయకులు


బోథ్: ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు సిబ్బంది


తాంసి: ఎంపీపీ మంజులను సన్మానిస్తున్న ఉద్యోగులు


నేరడిగొండ: మహిళలను సన్మానిస్తున్న ఎంపీపీ


ఇచ్చోడ: ఉద్యోగిని సన్మానిస్తున్న అధికారులు


గుడిహత్నూర్: మహిళను సన్మానిస్తున్న ఎంపీపీ

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని దంషతండా గ్రామానికి చెందిన లింగు పటేల్ కోడలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ గురువారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాల శంకర్, ఆడే జనార్దన్, మధుకర్, బసన్‌దాస్, కుంట శంకర్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సిరికొండ బస్టాండ్ వద్ద గురువారం భారత జాగృతి మండల కన్వీనర్ మైల మహేశ్ కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మండల కేంద్రానికి వచే వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివకుమార్, మాల సంఘం అధ్యక్షుడు బొజ్జ లక్ష్మణ్, బత్తుల ఉశన్న, బొజ్జ మల్లేశ్, శాంతపురం రాజేశ్వర్, అనిల్, రాకేశ్ పాల్గొన్నారు.

సన్మానం

జైనథ్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ మహిళా సిబ్బందిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీవో దిలీప్ కుమార్, వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్ కుమార్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ముత్యం రావు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ

జైనథ్: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో రూ. 5 కోట్ల ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దీపాయిగూడలో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ప్రజా సంక్షేమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, లోక కరుణాకర్ రెడ్డి, గిమ్మ సంతోష్, నిమ్మల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

నేరడిగొండ: ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీడీవో రాజ్‌వీర్‌లు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. వినియోగదారులు గతంలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పొరపాట్లు ఉంటే మళ్లీ దరఖాస్తులు చేసుకునేలా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో బిల్లులు రాని వారు విద్యుత్ బిల్లు రశీదుతో పాటు ప్రజాపాలన రశీదు, రేషన్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లు సమర్పించాలన్నారు. కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

బేల: ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకోని, గతంలో దరఖాస్తులో వివరాలు సరిగా ఇవ్వని ప్రజలు ప్రజాపాలన కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శంకర్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో కొనసాగుతన్న ప్రజాపాలన కౌంటర్లను పరిశీలించారు. తెల్లరేషన్ కార్డు ఉండి జీరో విద్యుత్ బిల్లు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు రాని వారు మరోసారి కచ్చితమైన పూర్తి వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. మండల పంచాయతీ అధికారి మహేశ్, తదితరులు ఉన్నారు.


ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ

ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన చైర్మన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రత్యేక కౌంటర్లను గురువారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సందర్శించారు. గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్లకు సంబంధించి దరఖాస్తుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారుల సమగ్ర సమాచారాన్ని నమోదు చేసి వారికి లబ్ధి కలిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ పరిధిలో నమోదైన వివరాలను ట్రాన్స్‌కో ఎస్‌ఈతో పాటు కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ వైఖరి మార్చుకోవాలి

కైలాస్‌నగర్: ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ వైఖరి మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జోగు రామన్న అధ్యక్షతన నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను తప్పు పట్టి ప్రజల్లో విషాన్ని నింపిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అదే ఎల్‌ఆర్‌ఎస్ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేసి భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ నేడు మాట మార్చడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో ఉచితంగానే భూముల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, రోకళ్ళ రమేశ్, విజ్జగిరి నారాయణ, అజయ్, దాసరి నారాయణ, స్వరూపరాణి, సాజితోద్దీన్, పవన్ నాయక్, సలీం పాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జోగు రామన్న

కుష్ఠు నిర్మూలనకు కృషి చేద్దాం

ఇంద్రవెల్లి: కుష్ఠు నిర్మూలనకు కృషి చేద్దామని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఈనెల 11 నుంచి 24 వరకు నిర్వహించే కుష్ఠు నిర్మూలన కార్యక్రమంపై గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ వ్యాధిక చర్మానికి, నరాలకు సోకుతుందని, వ్యాధి లక్షణాలు బయటపడేందుకు 5 సంవత్సరాల సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సందీప్, పీహెచ్‌ఎన్ జ్యోతి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్: కుష్ఠు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని వైద్యాధికారి రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 11 నుంచి 24 వరకు సర్వే చేపట్టాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాల గురించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివరించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. లక్షణాల నిర్ధారణ అనంతరం మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో హెచ్‌ఈవో చౌహాన్ నాందేవ్, సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, రాజవ్వ, చుక్కమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఆర్టీసీ ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు


పురస్కారం అందుకుంటున్న ఉద్యోగులు

ఆదిలాబాద్: మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ అధిక ఆదాయాన్ని సాధించేందుకు కృషి చేసిన ఆదిలాబాద్ రీజియన్‌కు చెందిన పలువురు ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉద్యోగ పురస్కారాలను అందుకున్నారు. గురువారం హైదరాబాదులోని కళాభవన్లో ఏర్పాటు చేసిన గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా రీజియన్‌లోని ఆదిలాబాద్ డిపో కండక్టర్ ఎస్.కె హైదర్, డ్రైవర్ బాబు టిబీ రెడ్డిలు పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలవడం పట్ల రీజనల్ మేనేజర్ సోలోమన్, డిపో మేనేజర్ కల్పన ఉద్యోగులను అభినందించారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ లక్ష్మి గురువారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడకుండా చూడాలని, సిబ్బందికి సూచించారు. విద్యార్థుల వివరాలను పరీక్ష సూపరింటెండెంట్ సుదర్శన్‌ను అడిగి తెలుసుకున్నారు. గురువారం 325 మంది విద్యార్థులకు 322 మంది హాజరయ్యారు.

సీహెచ్‌సీలో తాగునీటి కటకట

- ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నార్నూర్: సర్కారు దవాఖానాలో రోగులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని పాలకులు, అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం రోగులకు ఇబ్బంది తప్పడం లేదు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో తాగునీటి సౌకర్యం లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగులు ఇంటి నుంచే బాటిళ్ల ద్వారా తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లకు నీరు రాకపోవడంతో దుర్వాసన వస్తుంది. కాలకత్యాలకు ఆరు బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రికి ప్రత్యేకంగా నీటి సౌకర్యం లేకపోవడంతో ఆసుపత్రి భవన నిర్మాణం కోసం కాంట్రాక్టర్ నిర్మించిన సంపులో మిషన్ భగీరథ నీటిని వదిలి ప్రత్యేక మోటార్ ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే సంపుపై పైకప్పు లేకపోవడంతో నీరు కలుషితమౌతోంది. సంబంధితశాఖ అధికారులు స్పందించి సర్కార్ దవాఖానలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారి రాంబాబును వివరణ కోరగా.. నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. మోటారు రిపేరు ఉండడంతో సమస్య ఉందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.


బయటి నుంచి నీటిని తెచ్చుకుంటున్న రోగుల బంధువులు

పశువులను తరలిస్తున్న వాహనాల పట్టివేత

నేరడిగొండ: మూగజీవాలను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని రోల్‌మమడ టోల్ ప్లాజా వద్ద గురువారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న వాహనాల్లో పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఒక వాహనంలో 35 ఎద్దులు ఉండగా.. మరో వాహనంలో 28 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. వాటిని ఇచ్చోడలోని గోశాలకు తరలించడంతో పాటు వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా అనుమతి లేకుండా మూగజీవాలను వాహనాల్లో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 8న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే పీఆర్టీయూ ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్ నాయక్, నర్ర నవీన్ యాదవ్‌లు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సమ్మేళనానికి హాజరవుతారని తెలిపారు. ఉదయం 11 గంటలకు యాదవ సంఘ భవనం నందు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, సర్వశిక్ష అభియాన్, సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సేవాలాల్ మహరాజ్ దీక్ష చేపట్టాలి

నార్నూర్: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని కొత్తపల్లి హెచ్ బంజారా జాతీయ దీక్ష భూమి వద్ద ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక గురువు శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ దీక్ష చేపట్టాలని జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. గురువారం మండలంలోని బంజారా జాతీయ దీక్ష భూమి వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రతి ఏడాది దీక్ష భూమి వద్ద లంబాడా గిరిజనులు భారీ మొత్తంలో దీక్ష చేపడుతారని గుర్తు చేశారు. కార్యక్రమంలో లైవ్ జిల్లా ఇన్‌చార్జి వసంత్ రావు, చౌహాన్ సేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

బట్ట సంచులు పంపిణీ

బేల: మండలంలోని బాది గ్రామ శివారులోని నందీశ్వర ఆలయ ప్రాంగణంలో గురువారం ప్రారంభమైన జాతరలో ప్లాస్టిక్ నిషేధిస్తూ.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జుగ్నాక్ గాంధీ బట్ట సంచులను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిడాం నందకుమార్, కృష్ణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ విద్యార్థి పరిషత్ 2024 క్యాలెండర్‌ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీఈవో ప్రణీత వేర్వేరుగా ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్, రాథోడ్ మిథున్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎస్టీటీ యూనియన్ క్యాలెండర్‌ను నోడల్ ఆఫీసర్ ఇదపు పోశెట్టి ఉపాధ్యాయులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాకేశ్‌కుమార్, రవి, సీతారాం, సుదర్శన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.